
# సత్యవాక్యము

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

OCTOBER - 2008

సంవత్సర చందా రూ. 50/-

# ఏషియన్ బైబిల్ లెక్చర్‌షిప్

## Asian Bible Lectureship at Kakinada

| | | |
|---|---|---|
| తేదీలు | : | 2008 నవంబరు 30వ తేదీ నుండి<br>డిశంబరు 4వ తేదీ వరకు |
| సమయం | : | ప్రతిరోజు ఉదయం 10:00 గంటలకు<br>మధ్యాహ్నం 3:00 గంటలకు<br>సాయంత్రం 6:00 గంటలకు |
| స్థలం | : | సత్యవాణి - క్రీస్తుసంఘము<br>7-9-35 సాంబమూర్తి వీధి<br>కుళాయి చెరువు ఎదురుగా<br>కాకినాడ - 533 004. |

ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్‌లో ఆసియాలోని పలుదేశాలలో సువార్త చాటుచున్న గొప్ప బోధకులు, స్వదేశీ బోధకులు ఉపన్యసించెదరు, బైబిలులోని ప్రాముఖ్యాంశములను తెలిసికొనుటకు మీకు ఇదే మంచి తరుణము. ఆ సభలో పాల్గొనుటకు మీరు మీ సంఘము ఇప్పటి నుండే సిద్ధపడండి.

Cell : 92474 56270
0884 2363722

వందనములతో
లక్ష్మి గూటంగారు
జాషువా గూటంగారు

# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 29 | అక్టోబరు 2008 | సంచిక -3


## దేవుడొకడున్నాడు

(There is a God)

"ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" అను వాక్యముతో బైబిలు గ్రంథము ఆరంభమగుచున్నది. దేవుని ఉనికిని నిరూపించుటకు బైబిలు ప్రయత్నించుట లేదుగాని, చదువరి దేవుని యొక్క ఉనికిని సహజముగా అంగీకరించువాడనే భావముతో అది లిఖించబడెను. దేవుని ఉనికిని అంగీకరించుట ఆమోద యోగ్యమైనది, న్యాయ సంబంధమైనది. ఏలయనగా "దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములలో అనుకొందురు" అని అది చెప్పుచున్నది (కీర్తన 14:1).

దేవుడు మన భౌతిక ప్రపంచాన్ని దానిలోని సమస్తాన్ని చేసారు. ఈ భౌతిక ప్రపంచమును పాలించుటకు గాను ఆయన భౌతిక సూత్రాలను, లేక ప్రాకృతిక చట్టాలను చేసారు. గనుక ప్రకృతి అంతయును దేవుని ప్రకృతి చట్ట ప్రకారమే చలించును. అలాగే ఆయన మానవుని నైతిక విలువల గల వ్యక్తిగా సృజించారు. అందువలన మానవుని పాలించుటకు గాను, లేదా మానవ లోకము సక్రమంగా చలించుటకు గాను ఆయన నైతిక చట్టాలను(Moral Laws) ఏర్పరచారు, దేవునితోను, సాటి మానవులతోను సత్సంబంధము

కలిగిజీవించుటకు సమైక్యత కలిగి జీవించుటకు మానవునికి నైతిక సూత్రములవుసరం. అయితే మానవుని కొరకు దేవుడేర్పరచిన ఈ నైతిక సూత్రములు పరిపూర్ణమైనవి, అధికార పూరితమైనవని మనం గ్రహించాలి. అందువలన వాటికి సంపూర్ణవిధేయత చూపించబడాలి. మానవునికేది శ్రేష్ఠమో దేవుడెరుగును గనుక, ఎప్పుడైనను, ఏకాలమందైనను కూడ మానవుడు దేవుని చట్టాలకు కలుపుట గాని, తీసివేయుట గాని, మరొక దానిని వాటి స్థాన మందుంచుట గాని చేయరాదు.

ఆలాగే, దేవుని సృష్టిని కూడ మనం పరికించాలి. మరియు మానవుడు రక్షింప బడుటకు గాను ఆయన చేసిన నిత్య సంకల్పమును కూడ మనము తెలిసికోవాలి అందువలన ప్రతి మానవుడు, నేనెక్కడి నుండి వచ్చాను ? దేవుని సృష్టము వలె ఈ లోకములో నేనేమి చేయాలి ? నేను చనిపోయిన తరువాత నేనెక్కడికి వెళ్ళుదును ? నాకేమి జరుగును ? అనే ప్రశ్నలకు జవాబును తెలిసికొని యుండాలి. మనలో ప్రతివాడు ఏదోఒక సమయమందు ఈ ప్రశ్నలను వేసుకొన్నవారమే ప్రతివాడు ఈ ప్రశ్నలకు జవాబును వెదుకుచున్నవాడే. గనుక వీటికి జవాబిచ్చుటకు ఈ పాఠాలలో పూనుకొందము. మొదటిగా, మానవుడు ఎంపిక చేసుకొనే వ్యక్తిగా దేవునిచే సృజింపబడిన వాడని తెలిసికొందాము. దేవుని ఉనికిని ఒక యధార్థమైన వాస్తవంగా బైబిలు అంగీకరించుచున్నది. ఈ విశ్వము యొక్క గంభీరతను, దానిలోయున్న క్రమాన్ని, జీవాన్ని మనం గమనించునపుడు, యిదందయు ఒక అకస్మిక సంఘటన వలనగాని, లేదా దానికదే వచ్చిపడెనని గాని అనుకొనలేము. ఎవరో ఒకరు మనలను చేసియుండాలి. ఆ ఎవరో ఒకరు, లేదా ఏదో ఒకటి అత్యున్నత మేధావి (Supreme Intelligent Being) అయినా అయ్యుండాలి లేదా భౌతిక లోకంలో గొప్ప అకస్మిక సంఘటన అయినా అయ్యుండాలి. ఆ అత్యున్నత మేధావి దేవుడే అని నమ్ముట న్యాయ సంబంధమైనది. ఆయనే మానవుని సృజించిన కర్త.

రెండవదిగా, ఆ సృష్టికర్త మానవుని సృజించాడు: దేవుడు మొదట ఒక పురుషుని, ఒక స్త్రీని చేసారు. ఆయన ఆదాము హవ్వలను చేసారు. ఆయన వారిని తన స్వరూపమందు తన పోలిక చొప్పున చేసారు. "దేవుడు-మన స్వరూపమందు మనపోలిక చొప్పున నరులను చేయుదము" అని చెప్పెను. "దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను; దేవుని స్వరూపమందు వాని సృజించెను. స్త్రీనిగాను, పురుషునిగాను వారిని సృజించెను" అని బైబిలు చెప్పుచున్నది (ఆది. కా.

1:26,27) దేవుడు భౌతిక కాయుడు కాదు గనుక, మరియు దేవుడు ఆత్మగనుక, దేవుని ఆత్మీయ స్వరూపములో మానవుడు సృజింపబడ్డాడు (ఆది.కా. 4:24). దేవుని ఆత్మీయ స్వరూపముగల మానవుడు భావాలను, ఆత్మలను, మేధస్సును కలిగినవాడు. అతడు ప్రేమిస్తాడు, సంతోషిస్తాడు,దీర్ఘశాంతము,విస్వాసము మొదలగు భావాలను కలిగియున్నాడు. అట్లే అతడు ద్వేషిస్తాడు, కోపిస్తాడు, దు:ఖిస్తాడు కూడ. మానవుని శరీరం భౌతికం. అందువలన, మానవుడు చనిపోయినప్పుడు, "మన్నయినది వెనుకటి వలెనే మరల భూమికి చేరును; (ప్రసంగి 12:7). అందువలన ఆదాము హవ్వలనుండి నేటివరకు యున్న మానవులందరు దేవుని ఆత్మీయ స్వరూపమందు చేయబడినవారే.

దేవునిస్వరూపమందు చేయబడి యుండుటలో ఎంపిక చేసుకొనే శక్తి కూడ ఇమిడి యున్నది. మానవుడు ఏదో ఒకదానిని ఎంచుకొనగల వ్యక్తియై యున్నాడు. ఆదాము హవ్వలే గాని, మనవే గాని ఈ ఎంపిక శక్తిని వినియోగించు కొనులాగున, మనం జీవించుచున్న ఈ లోకంలో ఆయన మనకు తరుణముల ననుగ్రహించారు, అలాగే ఈ భౌతిక ప్రపంచాన్ని చలింప జేయుటకు గాను ఆయన ప్రకృతి సూత్రాల నేర్పరచారు. మానవుని ప్రవర్తనను అదుపులో యుంచుటకు గాను ఆయన నైతిక సూత్రముల నిచ్చారు.ఆదాము హవ్వల ప్రవర్తనను గమనించుటకు గాను ఆయన వారికిచ్చిన సూత్రాలలో "ఏదేను తోటలో మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలములను తినకూడదు" అని ఆయన వారికి చెప్పారు. అయితే ఆదాము హవ్వలిద్దరు దేవుడిచ్చిన ఈ చట్టాన్ని ఉల్లంఘించారు. నిషేధింపబడిన ఫలమును తిన్నారు. అట్లు చేయుట వలన దేవుని ఆజ్ఞను అతిక్రమించారు. ఆయన ఆజ్ఞకు వ్యతిరేకముగా ప్రవర్తించారు.

దేవుని ఆజ్ఞను వ్యతిరేకించుట పాపము. అందువలన ప్రప్రథముగా పాపము లోకములో ప్రవేశించింది. మానవ చరిత్రలో అతి ఘోరమైన సంఘటన అది. అతి విచారకరమైన దుర్వార్త అది. ఏలయనగా మానవుని వలన, మానవుని ద్వారా పాపము లోకములో ప్రవేశించింది. "ఇట్లుండగా ఒక మనుష్యుని ద్వారా పాపమును, పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో ఆలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్తమాయెను" (రోమా 5:12). ఆదాము వలన లోకములోనికి పాపము ప్రవేశించినదని ఈ లేఖన భాగము చెప్పుచున్నది. ఆదాము పాపము చేసినమొదటి మానవుడు గనుక యిది

నిజము. మానవుడు పాపము చేయుట వలన దేవుని నుండి దూరమై ఆత్మీయ మరణము నొందాడు. యిది మానవుని మొదటి దుర్వార్త. పాపము అతనికి ఒక ఘోరమైన సమస్య అయ్యింది. "మీ దోషములు మీకును, మీ దేవునికిని అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగు పరచెను. గనుక ఆయన ఆలకింపకున్నాడు" అని ప్రవక్తయైన యెషయా అందుకే పలికెను (యెషయా 59:1,2).

ఆదాము హవ్వలు పాపము చేయగా ఏదేను వనము నుండి దేవుడు వారిని పంపివేసెను. వారు జీవవృక్ష ఫలములు కూడ తీసికొనితిని నిరంతరము జీవించకుండు నిమిత్తము దేవుడు వారిని ఏదేను నుండి పంపించివేసెను (ఆది.కా. 3:22-23). అందువలన ఆదాము యొక్క పాపము వలన భౌతిక మరణము కూడ సంప్రాప్త మాయెను. అది మానవుల కందరకు సంక్రమించింది. ఏలయనగా మానవజాతి జీవవృక్షము నుండి వేరుచేయబడింది, "మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను. ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27). మన మందరము భౌతిక మరణాన్ని ఎదుర్కొనుచున్నాము. యిదొక ఘోరమైన సమస్య. దీనినుండి మనం బయట పడుట ఎట్లు ? అయితే దేవుడొక వాగ్దానాన్ని ఆది.కా. 3:15లో చేసాడు. మనకొక రక్షకుని ఆయన వాగ్దానము చేసాడు. ఆయనే యేసుక్రీస్తు. ఆయనయందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన వారిని ఆయన రక్షిస్తాడు. నీవు క్రీస్తులో యున్న రక్షణను పొందగోరుచున్నావా ?

**తుప్పు సాక్షిగా :**(Rust as a witness):

# బైబిలు ఇచ్చుటను గూర్చిన గ్రంథము

(The Bible, A Book on Giving)

మత్తయి సువార్తలో ఇచ్చుటను గూర్చి 33 సార్లు చెప్పబడింది. మార్కు సువార్తలో అది ఇరవైసార్లు చర్చించ బడింది, లూకా సువార్తలో ఇచ్చుటను గూర్చి 53 సార్లు చెప్పబడింది. ఇచ్చుటను గూర్చి చెప్పని క్రొత్తనిబంధన పుస్తకములు యేమీ లేవు. మిగతా అంశాలన్నిటికంటే ఇచ్చుటను గూర్చి బైబిలు ఎక్కువ బోధించుచున్నది.

**కయీను హేబెలు:**

"కొంత కాలమైన తరువాత కయీను పొలము పంటలో కొంత యెహోవాకు అర్పణగా తెచ్చెను. హేబెలు కూడ తన మందలో తొలుచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని కొన్ని తెచ్చెను. యెహోవా హేబెలును అతని యర్పణను లక్ష్యపెట్టెను; కయీనును అతని యర్పణను లక్ష్య పెట్టలేదు. కాబట్టి కయీనుకు మిక్కిలి కోపము వచ్చి అతడు తన ముఖమును చిన్నబుచ్చుకొనెను" (ఆది.కా. 4:3-5).

హేబెలు తన మందలో తొలు చూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని కొన్ని తెచ్చి తన కృతజ్ఞతను దేవునికి తెలియజేసాడు. దానివలన తాను పాపినని ఒప్పుకొన్నాడు, వాగ్దానము చేయబడిన మెస్సీయ యందు తన విశ్వాసాన్ని ప్రకటించాడు. అందువలననే "విశ్వాసమును బట్టి హేబెలు కయీను కంటె శ్రేష్టమైన బలి దేవునికి అర్పించెను. దేవుడతని అర్పణలను గూర్చి సాక్ష్య మిచ్చినప్పుడు అతడు విశ్వాసమును బట్టి నీతిమంతుడని సాక్ష్యము పొందెను. అతడు మృతినొందియు ఆ విశ్వాసము ద్వారా మాటలాడుచున్నాడు" (హెబ్రీ 11:4).

విశ్వాసము ద్వారా హేబెలు శ్రేష్టమైన బలి అర్పించాడనుటలో, అందులో అతని అర్పణే గాక తన పాపముల కొరకై వధించబడు దానిని కూడ తెచ్చాడను భావము దానిలో యున్నది. దానికి తన మందలో తొలుచూలున పుట్టిన వాటిని ఎంచు కున్నాడు. అది దేవుని క్రమపద్ధతిని బట్టి ఈ లోక పాపములను తీసికొని పోవు దేవుని గొర్రెపిల్లకు గురుతుగా యున్నది. అందుకే "దేవుడతని యర్పణలను గూర్చి సాక్ష్య మిచ్చినప్పుడు" అని యన్నప్పుడు అతడు ఒకటి కంటె ఎక్కువ తెచ్చాడు. విశ్వాసమును బట్టి హేబెలు తన యర్పణలను తెచ్చాడనగా విశ్వాసమునకు అతడు విధేయత చూపించాడన్నమాట. అంటే దాన్ని గూర్చిన ఆజ్ఞ ఇయ్యబడిందని యర్థము. ఆజ్ఞలేని చోట అతిక్రమము కూడ యుండదు. యేమి తేవాలో ఎంత తేవాలో దేవుడు వారికి చెప్పియుండని యెడల కయీను ఏమీ తప్పుచేసి యుండకపోవును. అయితే దేవుడతని ఖండించినందున అతడు దేవుని ఆజ్ఞకు అవిధేయత చూపాడనుట వాస్తవము. అతడు దేవుని ఆజ్ఞను అతిక్రమించాడు.

హేబెలు శ్రేష్టమైన బలి అర్పించాడని చెప్పబడింది. అంటే తెచ్చిన వాటిలోను, మొత్తములోను శ్రేష్టమైన దానిగా తెచ్చాడు. (He brought greater in Quantity as well as in quality) కయీనయితే తగినంత అర్పించలేదు. దేవుని ప్రజలు దేవునికి తగినంత అర్పించక పోతే ఆయన వారిని శిక్షించునని ఇందును బట్టి గ్రాహ్యా మగుచున్నది.

**అబ్రాహాము ఇచ్చినది**

మెల్కీసెదెకు " అబ్రామును ఆశీర్వదించి ఆకాశమునకు భూమికి సృష్టికర్తయు సర్వోన్నతుడునైన దేవుని వలన అబ్రాము ఆశీర్వదింపబడును గాకనియు, నీ శత్రువులను నీ చేతికి అప్పగించిన సర్వోన్నతుడగు దేవుడు స్తుతింపబడును గాక అనియు చెప్పెను. అప్పుడతడు అన్నిటిలో ఇతనికి పదియవ వంతు యిచ్చెను" (ఆది.కా. 14:19-21).

అబ్రాము రాజులను ఓడించి కొల్లగొట్టిన సొమ్ము అంతటిలోను పదియవ వంతు సర్వోన్నతుడైన దేవునికి అర్పించెను. మోషే ధర్మశాస్త్రము ఇయ్యబడక 500 సంవత్సరములకు ముందు యిది జరిగెనని గమనించుదము. గనుక దశమభాగము అర్పించడం మోషే ధర్మశాస్త్రము వలన గాని, యాకోబు వలన గాని ఆరంభించ బడలేదు.

**యాకోబు ఇచ్చినది**

"అప్పుడు యాకోబు - నేను తిరిగి నా తండ్రి యింటికి క్షేమముగా వచ్చునట్లు దేవుడు నాకు తోడైయుండి, నేను వెళ్ళుచున్న యీ మార్గములో నన్ను కాపాడి, తినుటకు ఆహారమును ధరించుకొనుటకు వస్త్రములను నాకు దయచేసిన యెడల యెహోవా నాకు దేవుడైయుండును. మరియు స్తంభముగా నేను నిలిపిన ఈ రాయి దేవుని మందిర మగును; మరియు నీవు నాకిచ్చు యావత్తులో పదియవ వంతు నిశ్చయముగా నీకు చెల్లించెదనని మ్రొక్కుకొనెను" (ఆది.కా. 28:20-22).

యాకోబు బెయేర్షబా నుండి బయలుదేరి హారాను వైపు వెళ్ళుచు రాత్రివేళ ఒక చోట పండుకొనెను. అప్పుడతడొక కల కనెను. ఆ కలలో నిచ్చెన ఒకటి ఆకాశమున కంటు చుండెను. దానిమీద దేవుని దూతలు ఎక్కుచు దిగుచునుండెను. యాకోబు నిద్రలేచి నిశ్చయముగా యెహోవా ఈస్థలమందున్నాడు అనుకొని అతడు భయపడెను.

మనుష్యులు భయపడినప్పుడు, శోధనలలో చిక్కుకొనినప్పుడేమి చేతురో దానినే యాకోబు చేసాడు. అతడు దేవునికి మ్రొక్కుకొన్నాడు ! అదేమిటి ? తన రాబడి యంతటిలో పదియవ వంతు దేవుని కిస్తానన్నాడు. తాను ఈ నిశ్చయత చేసినప్పుడు యాకోబు చాల బీదవాడే. తరువాత అతడు బహు ధనవంతు డయ్యాడు. అయినను అతడు దేవునికి దశమభాగము నిచ్చుటలో ఎన్నడు వెనుకాడ లేదు. యిదికూడ మోషే ధర్మశాస్త్రమునకు ముందే జరిగిందని గమనించుదము.

**రైతులకు హెచ్చరికలు**

" మీరు మీ భూమి పంటను కోయునప్పుడు నీ పొలము యొక్క ఓరలను పూర్తిగా కోయకూడదు; నీ కోతలలో పరిగెను ఏరుకొన కూడదు. నీ

ఫలవృక్షముల తోట పరిగెను కూర్చుకొనకూడదు. నీ ఫలవృక్షముల తోటలో రాలిన పండ్లను ఏరుకొనకూడదు, బీదలకును పరదేశులకును వాటిని విడిచి పెట్టవలెను" (లేవీ 19:9-10). ఒకడు తన పంటను కోయునప్పుడు బీదలను జ్ఞాపకం చేసుకోవాలని దీని యర్థము. విశాల హృదయము గల యూదులు తమ పొలము యొక్క ఓరలలో స్వాధ్యాన్ని కొరకు చాలు తెచ్చిన సామాగ్రి మైనంత ఎక్కువ కోయకుండా బీదల కొరకు విడిచిపెట్టేవారు.

" నీ మొదటి సస్య ద్రవ్యములను అర్పింప తడవు చేయకూడదు. నీ కుమారులలో జ్యేష్టుని నాకు అర్పింపవలెను" (నిర్గమ 22:29). దీనిని బట్టి దేవుడు ప్రధమఫలాన్ని, శ్రేష్టఫలాన్ని తనకొరకు ఆజ్ఞాపించినట్లు తెలిసికొనగలము. తల్లిదండ్రులు తమ బిడ్డలను దేవునికి అర్పించి నప్పుడు వారిని విడిపించు కొనవచ్చును (లేవీ 3:46-48).

**ఇష్టపూర్వక అర్పణలు**

" నీ దేవుడైన యెహోవాకు వారముల పండుగ ఆచరించుటకై నీ చేతనైనంత స్వేచ్ఛార్పణమును సిద్ధపరచవలెను. నీ దేవుడైన యెహోవా నిన్ను ఆశీర్వదించిన కొలది దాని నియ్యవలెను'' (ద్వితీ 16:10). స్వేచ్ఛార్పణముగా యిచ్చునప్పుడు ఇచ్చువాని దాతృత్వమును బట్టి ఇయ్యనగును. స్వేచ్ఛార్పణము విషయములో ఇశ్రాయేలీయుల హృదయ మెట్లుండెనో మనం తెలిసికొనుటకు గాను నిర్గమ 36:6-7లో ఇట్లు వ్రాయబడియున్నది: " మోషే - పరిశుద్ధ స్థలమునకు ఏ పురుషుడైనను ఏ స్త్రీయైనను ఇకమీదట ఏ అర్పణనైనను తేవద్దని ఆజ్ఞాపించెను గనుక పాళెమందంతటను ఆ మాట చాటించిరి; ఆపని అంతయు చేయునట్లు దాని కొరకు వారు తెచ్చిన సామాగ్రి చాలినది, అది అత్యధికమైనది. గనుక ప్రజలు తీసికొని వచ్చుట మానిరి".

ఇచ్చుటను గూర్చి మనం ప్రజలకు బోధించినప్పుడు వారు తప్పక సంతోషముతో యిస్తారు.

" మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడిన వన్నియు మనకు బోధకలుగు నిమిత్తము వ్రాయబడియున్నవి. (రోమా 15:4). పాతనిబంధనలో ఎంత ఇయ్యాలో, ఎట్లు ఇయ్యాలో బోధింపబడిన దానిని గమనించినప్పుడు మనం ఎంత తక్కువ దేవునికి ఇచ్చుచున్నమో యని సిగ్గుపడాలి. ఇయ్య వలసినంత ఇయ్యనప్పుడు ప్రజలు శిక్షించబడ్డారు. కయీను అందుకొక ఉదాహరణ.

కాలారంభము నుండే ఇచ్చుటను గూర్చి మానవునికి బోధింప బడినది. హేబెలు విశాల హృదయుడైనందున ఆశీర్వదించబడెను. అబ్రాహాము, యాకోబులు విశాలంగా దేవునికిచ్చారు గనుక ప్రఖ్యాత పురుషులయ్యారు. దేవుని

వాగ్దానములన్నియు విశాలమైనవే, ఆకాశపు వాకిండ్లు విప్పి పట్టజాలనంత విస్తారమైన దీవెనలు ఆయన మనకను గ్రహించును. యేసు ఇట్లు చెప్పారు: "కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును" (మత్త 6:33). నీవు దేవుని మాటలను నమ్ముచున్నావా?

**- వి.పి.బ్లేక్**

**ప్రకటన గ్రంథ ప్రసంగ మాలిక - 27**

# దీవించబడిన దేవుని పరిశుద్ధులు

(The Blessed Saints of God)

**పరిచయము:**

ప్రకటన గ్రంథము ఒక విజయ గ్రంథము. A Book of Victory! దేవుడు తన శత్రువులను ఒక్కొక్కరిని అంత మొందించుట ఇంతవరకు చూచాము.

ప్రకటన 20:1-3లో సాతాను యొక్క అంతము ఆరంభమగుట చూచావు. 20:4-6లో దేవుని పరిశుద్ధులను గూర్చి గమనించుదాం.

**పరిశుద్ధుల పాలన: (20:4-6)**

" అంతట సింహాసనములను చూచితిని" అని యోహాను చెప్పాడు.

- సింహాసనమనగా అధికార స్థావరము. ఈ సింహాసనము ఎక్కడ ఉండెనో చెప్పబడలేదు.

- ప్రకటన గ్రంథములో సింహాసనములను గూర్చి 48 సార్లు చెప్పబడింది. సాతాను యొక్కయు, వాని అనుచరుడగు క్రూరమృగము యొక్కయు స్థావరములు తప్ప మిగతా అన్ని సందర్భములలోను సింహాసనములు పరలోకములోనే యున్నట్లు కనబడును.

- పరిశుద్ధులు యేసుక్రీస్తు ద్వారా యేలుదురని రోమా 5:17 చెప్పుచున్నది.

- ఈ సింహాసనముల మీద ఎవరు యేలుదురు ? అపోస్తలులు (మత్తయి 19:28); క్రైస్తవులు (ప్రక 2:26; 3:21).

- యోహాను శిరచ్ఛేదనము చేయబడిన వారి ఆత్మలను చూచెను. వారు బ్రదికిన వారై వెయ్యి సంవత్సరములు క్రీస్తుతో కూడ రాజ్యము చేసిరి.

- వారు క్రూరమృగముకు దాని ప్రతిమకు నమస్కారము చేయనివారు.

- దాని ముద్రను వేయించు

కొననివారు; సాతాను అనుచరులు కాదు.

- క్రీస్తుకొరకు సాక్ష్యమిచ్చి హతసాక్షులైనవారు.

**విమర్శ చేయుటకు అధికారము:**

సింహాసనము మీద యుండువారు పాలించుటకు అధికారము గలవారు. యేసు విషయమై తామిచ్చిన సాక్ష్యము నిమిత్తము హత సాక్షులైన వారు (ప్రక 6:9-11). క్రైస్తవులందరు ఈ యధికారమును పొందిన వారే (1కొరింధీ 6:1-2; దానియేలు 7:22).

- "వారు బ్రదికిన వారై వెయ్యి సంవత్సరములు క్రీస్తుతో కూడ రాజ్యము చేసిరి"

- క్రీస్తు ఎక్కడ పాలించుచున్నారు? పర లోకమందు ఆయన ఇప్పుడు పాలించుచున్నారు (కీర్తన 110:1; అపో.కా. 2:29-36; ప్రక 3:21).

క్రైస్తవులు కూడ ఆయనతో ఇప్పుడు పాలించుచున్నారు (రోమా 5:17; ప్రక 5:10). ఇహపరముల యందు ఆయన సర్వాధికారియైయున్నాడు. క్రీస్తు రెండవసారి వచ్చిన తరువాత భూమి మీద వెయ్యేండ్లు పాలించుననునది పచ్చి అబద్ధ సిద్ధాంతము.

- ప్రకటన గ్రంధములో (బైబిలులో) వెయ్యి అనే సంఖ్య పరిపూర్ణత్వాన్ని సూచించును. ఇక్కడ చెప్పబడిన వెయ్యి సంవత్సరములు పరిపూర్ణ దీర్ఘకాలమునకు గురుతు. అది క్రీస్తు మొదట వచ్చిన నాటినుండి ఆయన మరల వచ్చువరకు యున్నకాలమును గూర్చి చెప్పబడిన సంఖ్య. ఈ సువార్త యుగకాలములో సాతానుడు బంధింపబడి యున్నాడు. సువార్త వెదజల్లబడే కొలదీ వాడు మరింత బంధింపబడును.

- క్రీస్తు కొరకు శిరచ్ఛేదనము చేయబడిన వారు క్రీస్తు మరల వచ్చువరకు ఆయనతో కూడ రాజ్యము చేయుచున్నారు.

- నమ్మకమైన క్రైస్తవుడు మరణించగా అతడు ప్రభువుతో కూడయుండును. అందుకే పౌలు " నా మట్టుకైతే బ్రదుకుట క్రీస్తే చావైతే లాభము" "నేను వెడలి పోయి క్రీస్తుతో కూడ యుండవలెనని నాకు ఆశయున్నది" అని చెప్పెను (ఫిలిప్పీ 1:23).

**వెయ్యేండ్ల పాలన సిద్ధాంతము:**

- క్రీస్తు భూమిపై వెయ్యేండ్లు పాలించుననే సిద్ధాంతము ఆయన రాకకు ముందున్న యూదులలో ఉద్భవించెను. మెస్సీయ వచ్చి భూమిపై తన రాజ్యమునుస్థాపించి పాలించునని వారు నమ్మారు. గాని క్రీస్తు రాక 100 సంవత్సరముల ముందు లోకమంతా దుష్టత్వంతో నిండి యుండుట వలన ఆ రాజ్యము రాదని వారు తలంచారు.

- వెయ్యేండ్ల పాలన సిద్ధాంతమును ప్లిమౌత్ బ్రదరన్ గ్రూపువారు, జె.యన్.డార్బీ,సి.ఐ.స్కోఫీల్డు అనువారు వ్యాపింప జేసారు. స్కోఫీల్డు రిఫరెన్స్ బైబిలు దీనిని గట్టిగా

ప్రోత్సాహించినది.- యేసు క్రీస్తు రహస్యముగా వచ్చి మృతులైన నీతిమంతులను, సజీవులుగా యున్న నీతిమంతులను పైకెత్తుకొని (Rapture) వెళ్తారని, అది ఏడు సంవత్సరముల పాటు ఉండునని, మొదటి మూడున్నర సంవత్సరములలో యెరూషలేములో సొలోమోను మందిరము తిరిగి కట్టబడునని, యూదులు పాలస్తీనాకు తిరిగి వస్తారని, జంతు బలులు పునరుద్ధరింపబడునని. తదుపరి మూడున్నర సంవత్సరములలో మహా శ్రమకాలము (హర్‌మెగిద్దోను యుద్ధము) సంభవించునని. అప్పుడు క్రీస్తు మరల వచ్చి యెరూషలేములో దావీదు సింహాసనము పైనుండి వెయ్యేండ్లు పాలించునని ఈ సిద్ధాంతభావము. ఎటొచ్చీ ఇదంతా పచ్చి అబద్ధ సిద్ధాంతము. ప్రకటన 20 వ అధ్యాయములో ఈ భావము లేనే లేవు.

**ప్రకటన 20 వ అధ్యాయము 4-6 వచనములు:**

- ఇందులో క్రీస్తు రెండవ రాకడను గూర్చి యేమీ చెప్పబడలేదు.

- శరీర పునరుత్థానమును గూర్చి చెప్పబడలేదు. యోహాను చూచినది శిరచ్ఛేదనము చేయబడిన వారి ఆత్మలు!

- క్రీస్తు భూమిపై పాలించును అని అక్కడ చెప్పబడలేదు.

- ఈ లేఖన భాగములో దావీదు సింహాసనమే చెప్పబడలేదు.

- యెరూషలేము, పాలస్తీనా మాటలు లేనే లేవు.

- పైకెత్త బడుట (Repture) మహా శ్రమల కాలము అను మాటలు లేవు.

- యూదులు మార్పుజెందుదురను మాటలు లేనే లేవు.

- భూమి పై నున్న క్రీస్తు సంఘమును గూర్చి చెప్పబడలేదు.

- భూమిపై యెరూషలేములో నుండి క్రీస్తు వెయ్యేండ్లు పాలించునను సిద్ధాంతము పచ్చి అబద్ధము. ఆయన ఇప్పుడు రాజైయున్నారు, పాలించుచున్నారు. ఆయన మరల వచ్చినప్పుడు ఆయన "సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును; అప్పుడు అంతము వచ్చును" (1 కొరింథీ 15:24).

- క్రీస్తు మొదట వచ్చినప్పుడు రాజ్యమును స్థాపించుటలో విఫలమవ్వలేదు. ఆయన రాజ్యమే సంఘము (మత్తయి 16:18-19; కొలస్స 1:13; ప్రక 1:9; యోహాను 3:5).

- యేసుక్రీస్తు రాజై పాలించుచున్నాడని పరిశుద్ధాత్మ ద్వారా అపొస్తలులు మొదటి శతాబ్దములోనే బోధించారు (అపొ.కా. 17:7).

- క్రీస్తు ఇప్పుడు దావీదు సింహాసనమందు ఆసీనుడై యున్నారు (అపొ.కా. 2:32-36; 7:56).

- మృతులైన నీతిమంతులు

ఒకసారి, దుష్టులు ఇంకొకసారి లేపబడుట గాక, సమాధులలో నున్నవారందరు ఒకేసారి లేపబడుదురు (యోహాను 5:28-29).

- అందరికీ ఒకేసారి తీర్పు తీర్చబడును.

**మొదటి పునరుత్థానము: (5-6వ)**

- " ఆ వెయ్యి సంవత్సరములు గడుచు వరకు కడమ మృతులు బ్రదుకలేదు; ఇదియే మొదటి పునరుత్థానము".

- కడమ మృతులు అనగా ఆత్మీయముగా మృతులైనవారు: అపరాధముల చేతను, పాపముల చేతను చచ్చినవారు (ఎఫెసీ 2:1).

- వారు క్రైస్తవ యుగము (ఆ వెయ్యేండ్లు) గడుచువరకు బ్రదుకలేదు.

- మొదటి పునరుత్థానము గ్రహించు కొనాలంటే, మొదటి మరణం యేమిటో తెలిసికోవాలి.

- అపరాధముల వలనను, పాపముల వలనను మృతులైన వారిని గూర్చి బైబిలు చెప్పుచున్నది. ఆదాము హవ్వలు నిషేధింపబడిన ఫలము తినగానే భౌతికంగా కాదుగాని ఆత్మీయముగా మరణించారు (ఆది.కా. 2:17). ప్రజలు సజీవులుగా యున్నా ఆత్మీయంగా మొదట మరణించిన వారే (1 తిమోతి 5:6).

- మొదటి పునరుత్థానము మనము క్రీస్తులోనికి మార్పు జెందినప్పుడు సంభవించెను. "మనము మన అపరాధముల చేత చచ్చిన వారమై యుండినప్పుడు సయితము మన యెడల చూపిన తన మహా ప్రేమచేత క్రీస్తుతో కూడ మనలను బ్రదికించెను; కృపచేత మీరు రక్షింపబడియున్నారు. క్రీస్తు యేసునందు మనలను ఆయనతో కూడ లేపి, పరలోకమందు ఆయనతో కూడ కూర్చుండ బెట్టెను"(ఎఫెసీ 2:5-7).

- మరల " క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందిన వారమై నడుచుకొనునట్టు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి. మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యము గలవారమైన యెడల, ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్య మందును ఆయనతో ఐక్యము గల వారమైయుందుము" (రోమా 6:3-6).

- ఒకడు రక్షింప బడినప్పుడు బాప్తిస్మములో మరణ, సమాధి, పునరుత్థానములను చిత్రీకరించును. బాప్తిస్మములో మొదటి పునరుత్థానము కనబడును.

– రెండవ పునరుత్థానము సమాధి నుండి శరీరము లేపబడి నప్పుడు సంభవించును (అపో.కా. 24:15; యోహాను 5:28-29; 1 కొరింథీ 15).

**ధన్యులు :**

– మొదటి పునరుత్థానము (బాప్తిస్మము) నొందినవారు ధన్యులు, పరిశుద్ధులు.

– క్రైస్తవులు దీవించబడినవారు, పరిశుద్ధులు (1 కొరింథీ 1:1-2; ఫిలిప్పీ 1:1).

– వీరు దేవునికిని క్రీస్తుకును యాజకులై క్రీస్తుతో కూడ వెయ్యి సంవత్సరములు రాజ్యము చేయుదురు.

– క్రైస్తవులు యాజకులు (1 పేతురు 2:5,9; ప్రక 1:6). క్రీస్తు మన ప్రధాన యాజకుడు (హెబ్రీ 4:15). క్రైస్తవులు యాజకులుగా ఆయన మందిరములో అనగా సంఘములో సేవ చేయుదురు (1 కొరింథీ 3:16-17).

– వారు రాజులై క్రీస్తుతో కూడ వెయ్యి సంవత్సరములు, అనగా క్రీస్తు వచ్చు వరకు రాజ్యము చేయుదురు.

– క్రీస్తు ఇప్పుడు రాజులకు రాజును, ప్రభువులకు ప్రభువునై యున్నారు. క్రైస్తవులు ఆయన చట్టమును ఇప్పుడు భూమిపై అమలుపరచుచు ఆయనతో కూడ రాజ్యము చేయు చున్నారు.

– ఇట్టి వారిపై రెండవ మరణమునకు అధికారములేదు. మొదటి మరణం ఆత్మీయంగా దేవుని నుండి తొలగిపోవుటయితే, రెండవ మరణం ఆయన నుండి నిత్యము వేరు చేయబడుటయే, ఈ రెండవ మరణం నరకము. అది అగ్ని గంధకములతో నిత్యము మండు గుండము (ప్రక 20:14).

**ముగింపు :**

యేసు క్రీస్తు రెండవసారి వచ్చునప్పుడు యెరూషలేములో నుండి వెయ్యేండ్లు పాలించునను సిద్ధాంతము బైబిలు నందు కనబడదు. ఆయన ఇప్పుడు రాజులకు రాజుగా పాలించు చున్నారు. ఆయన తిరిగి వచ్చునప్పుడు తన రాజ్యమును తండ్రికి అప్పగించును. అప్పుడు అంతము వచ్చును. నమ్మకమైన క్రైస్తవులు యాజకులై క్రీస్తుతో కూడ ఇప్పుడు రాజ్యము చేయుచున్నారు. వెయ్యి అనే సంఖ్య పరిపూర్ణ దీర్ఘ కాలమును అనగా సువార్త యుగమును సూచించుచున్నది.

**గమనిక**: క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్యవాణి' T.V. కార్యక్రమమును T.V-5 లో ప్రతి శనివారం ఉదయం 6:30 గంటలకు, ప్రతి సోమ,మంగళ వారాల్లో ఉదయం 6.00 గంటలకు శుభవార్త ఛానల్‌లో టి.వి. ద్వారా సువార్త వినండి !

బైబిలు సర్వే:

# క్రీస్తు సిలువ వేయబడుట

ప్రపంచ చరిత్రలో జరిగిన అతి ప్రాముఖ్యమైన సంఘటనలలో క్రీస్తు సిలువ వేయబడి పునరుత్థానము చెందుట అన్నిటికన్న ముఖ్యమైనది. రమారమి సువార్తలలో ఆయన ఆఖరి వారమును గురించియు ఆయన మరణమును గురించియు సమాధి మరియు తిరిగి లేచుటను గురించియు మూడవ భాగము వ్రాసిరి. ఈ పాఠము నందు ఆయనను సిలువ వేయుటను గూర్చి చదువుకొందము.

## ఆయన చివరి వారము

కొంతకాలము నుండి యేసు శిష్యులను విడిచి వెళ్ళిపోవుదును అని వారికి చెప్పుచు వచ్చెను. శిష్యులు ఆయనయొక్క ఆత్మీయ రాజ్యమును ఏలాగు అర్థము చేసికొనలేదో ఈ విషయమును కూడా అర్థము చేసికొనలేక పోయిరి. వారు ఆయన భూమి మీద రాజ్యమును స్థాపించి దానిని పరిపాలించ వలెనని ఇంకను కోరుకొనుచున్నారు. కనుకనే చాలమంది ప్రజలు ఆయన గాడిదపిల్లను ఎక్కి యెరూషలేముకు వెళ్ళుచున్నపుడు మహా ఉత్సాహముతో వెంబడించిరి. దారి పొడవున బట్టలు పరచి, కర్జూరపు మట్టలు ఆకులు పరిచి జయము ప్రభువు పేరిట వచ్చువాడు స్తుతింపబడునుగాక అని కేకలు వేసిరి. ఈ సంఘటన ఆదివారమున జరిగినది. అనగా ఆయనను సిలువ వేసిన రోజునకు ముందు 5వ రోజు.

ఆ మరుసటి రోజున యేసు దేవాలయములో ప్రవేశించి క్రయ విక్రయములను చేయువార లందరిని పారద్రోలెను. ఈ సంఘటన 3 సంవత్సరముల క్రితము ఆయన ఈలాగే చేసెను. ఈ వ్యాపారస్తులు ఆరాధించు వారియొద్ద వ్యాపారము ద్వారా అధిక లాభములను పొందుచుండిరి ఈ సంఘటనద్వారా ఆయన విరోధులకు బహు ఆగ్రహము పుట్టి ఆయనను చంపుటకు మరి ఎక్కువగా నిశ్చయించుకొనిరి.

పన్నెండు మంది శిష్యులలో ఒకడైన ఇస్కరియోతు యూదా క్రీస్తును

అప్పగించుటకు ప్రధాన యాజకుల యొద్దకు వెళ్ళినపుడు వారు బహు ఆత్రుత గల్గి, యూదా యొక్క దుర్మార్గతను ప్రోత్సాహపరిచిరి. వాదు జేతమాటుకొని 30 వెండి నాణెములు యూదాకు ఇచ్చుట, ప్రతి ఫలముగా యూదా యేసును అప్పగించుటకు అంగీకరించిరి.

### పస్కా విందు

యేసు తాను అప్పగింప బడబోవు రాత్రి ఒక మేడగదిలో ఆయన శిష్యులతో కూడుకొనెను. ఈ సమయముననే యేసు తన శిష్యులకు ఆఖరి మాటలు చెప్పెను. మరియు ఒక మహోత్కృష్టమైన ఉదాహరణ సేవచేయుట విషయములో వారికి చూపించెను. ఇది వారి పాదములను కడుగుట ద్వారా వారికి నేర్పించెను మరియు ఐక్యతను గురించి దేవునికి ప్రార్థించెను. దీనిని యోహాను సువార్త 17వ అధ్యాయములో చదువగలము. ఈ సమయముననే యేసు ఆయనను జ్ఞాపకము చేసుకొను రొట్టె విరుచు కార్యక్రమమును శిష్యులకు అప్పగించెను. ఆయన పులియనిదైన పస్కా రొట్టెను మొట్టమొదట తీసుకొని, తరువాత ద్రాక్షారసమును తీసుకొని తన శిష్యులకు ఇచ్చి ఇది నా శరీరము; నా రక్తము అని చెప్పెను.

కొంతమంది రొట్టె, ద్రాక్షారసము యేసుయొక్క శరీరమును, రక్తము అగునని అర్థము చేసికొందురు. ఈ సిద్ధాంతము నందలి తప్పుడు అభిప్రాయమును సులువుగా మనము విట్లు గ్రహించగలమన్న, శిష్యుల ముందే ఆయన రొట్టెను, ద్రాక్షారసమును, తన రక్తమునకును, తన శరీరమునకును సాదృశ్యముగా ఉదాహరించి, అలంకార రూపకముగా చెప్పెను. ఇది నా శరీరము అని చెప్పుటలో యేసు రొట్టె తన శరీరమునకు సాదృశ్యమైనదని చెప్పెను.

### గెత్సేమనే తోట

పస్కా భోజనమైన తరువాత యేసు యెరూషలేము పట్టణము విడచి, తన శిష్యులతో కెద్రోను నది దాటి అవలినున్న గెత్సేమనే వనమునకు వెళ్ళెను అక్కడ ఆయన తండ్రితో తండ్రీ ! నీ చిత్తమైతే ఈ గిన్నెను నాయొద్దనుండి తీసివేయుమని పట్టుదలగా ప్రార్థించెను. కాని యేసు సిలువ వేదనను తప్పించుకొనుట దేవుని చిత్తము కాదు. ఎట్లనగా ఈ రోజులలో కూడా దేవుడు తన బిడ్డలు అడుగునది ప్రతీ దానిని వారికి అనుగ్రహింపడు. యేసు మహా వేదనతో ప్రార్థించుట వలన ఆయన చెమట రక్త బిందువుల వలె కారెను. ఆయన శిష్యులయొద్దకు తిరిగివచ్చి వారు నిద్రించుట చూచెను ఆ సమయమున వారి యొక్క తోడు ఆయనకు ఎంతగానో అవసరమాయెను. ఈ విధముగా యేసు మూడుసార్లు

ప్రార్థించి ఆయన శిష్యులతో తోట విడచి వెళ్ళుటకు సిద్ధపడుచుండెను. ఆ సమయమునవే చాలా మంది కత్తులతోనూ, ఈటెలతోనూ సమాధానధిపతియైన యేసును పట్టుకొనుటకు అక్కడికి వచ్చిరి. వీరిని యూదా ఇస్కరియోతు నడిపించుకొని వచ్చెను. అతడు యేసు నొద్దకు తిన్నగా వెళ్ళి ఆయనపైబడి ఆయనను ముద్దు పెట్టుకొని అతనిని అప్పగించెను. వెంటనే పేతురు మహాధైర్యముతోనూ, కోపముతోనూ తన కత్తినితీసి ప్రధాన యాజకుని సేవకుని యొక్క చెవిని తెగనరికెను. కానీ మరుక్షణమే పేతురు మిగిలిన శిష్యులందరూ ఆయన ఆఖరి సమయములో యేసుని విడిచి పారిపోయిరి.

## తీర్పు

న్యాయ విధానమును బట్టి క్రీస్తుకు జరిగిన తీర్పు చాలా అవకతవకలుగా యున్నది. అర్ధరాత్రిలో ప్రధాన యాజకుడైన కయపయొక్క మామయైన అన్న యొద్దకు ఆయనను తీసుకొని వెళ్ళిరి. తరువాత అన్న దగ్గరనుండి ఆయనను కయపయొద్దకు తీసుకొని వెళ్ళిరి కయప యేసు మరణశిక్షకు పాత్రుడని తీర్పు చెప్పెను. ఈ రాత్రి సమయమందునే పేతురు యూదులకు భయపడి యేసుని యెరుగునని బొంకెను. మొట్టమొదట యూదా యేసునను అప్పగించెను. తరువాత పేతురు ఆయనను ఎరుగననెను. కానీ యూదా వెళ్ళి ఉరిపోసుకొని చనిపోయెను. పేతురు బిగ్గరగా ఏడ్చి మారుమనస్సు పొంది తరువాత తన జీవితకాల మంతయు ప్రభువునకు విశ్వాసిగా జీవించెను ఉదయమైన తరువాత క్రీస్తు యూదుల సభముందు ఉంచబడి కయప ఇచ్చిన తీర్పునే వారు ఆమోదించిరి. అయినను వారు రోమా పరిపాలన క్రింద ఉన్నారు కాబట్టి యూదుడగు ఒక మనిషిని చంపెడిఅధికారము లేదు. కాబట్టి రోమా గవర్నరు అయిన పిలాతు నొద్దకు యేసునువారు పంపించిరి. ఈ పిలాతునకు యేసుయందు ఏ దోషము కన్పించలేదు. ఆయనను హేరోదు తిరిగి ఆయనను పిలాతునొద్దకే పంపించెను. పిలాతు యేసును ఏదో ఒక విధముగా విడిపించవలెనని ప్రయత్నముచేసెను. కానీ ప్రజలను మెప్పించుటకై ఆయనను సిలువకు అప్పగించెను. యేసు నిరపరాధిఅని పిలాతునకు తెలుసు. రోమా సైనికులు యేసును అవమాన పరచి కొరడాలతో కొట్టి, సిలువవేయుటకు తీసుకొని పోయిరి.

## సిలువ వేయుట

యేసు శుక్రవారము ఉదయమున

ఇంచుమించు తొమ్మిది గంటలకు యెరూషలేము దగ్గర ఉన్న గొల్గొత అనబడే కల్వరి కొండపై సిలువ వేయబడెను. దీని అర్థము పుర్రె అని అర్థము. ఆయన తలపై సిలువ మీద యూదులకు రాజైన నజరేయుడైన యేసు అని వ్రాసిరి. ఆయనకు ఇరువైపుల ఇద్దరు దొంగలను కూడా సిలువవేసిరి.

ప్రపంచ చరిత్రలో ఇది బహు అంధకారమైనటువంటి సమయము. అయిననూ యేసు మరణమును జయించి సమాధినుండి తిరిగి లేచుట ద్వారా ఈ అంధకారమును పటాపంచలు చేసిన వెలుగువలె ప్రకాశింపజేసెను.

యేసు సిలువమీద పలికిన ఏడుమాటల ద్వారా ఆయన మరణ వృత్తాంతమును మనము గ్రహించగలము.

1. "తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు కనుక వీరిని క్షమించుము". నేలమీద సైనికులు ఆయన వస్త్రములను భాగములుగా పంచుకొనుచుండిరి.

2. ఆయన తల్లితో "అమ్మా ! ఇదిగో నీ కుమారుడు" అని యోహానును చూపించి చెప్పెను. అటులనే యోహానుతో "ఇదిగో నీతల్లి" అని తల్లిని చూపించి చెప్పెను.

3. తనను జ్ఞాపకము చేసుకొనుమని అడిగిన దొంగతో యేసు ఇలాగు అనెను. "నిశ్చయముగా నేడు నీవు నాతో పరదైసులో నుందువు" అని అనెను. ఆ సమయమున మధ్యాహ్నము పండ్రెండు గంటలాయెను. ఆ తరువాత మూడు గంటలు భూమి అంతటను చీకటిక్రమ్మెను.

4. " నా దేవా, నా దేవా నన్నేల చేయి విడిచితివి".

5. " దప్పిగొనుచున్నాను" అప్పుడు వారు చేదు చిరకను త్రాగనిచ్చిరి.

6. మధ్యాహ్నము మూడు గంటలకు "సమాప్తమైనది" అని బిగ్గరగాఆయన అరచెను.

7. "తండ్రీ ! నా ఆత్మను నీకు అప్పగించుకొనుచున్నాను" ఆయన మరణించినపుడు గొప్ప భూకంపము కల్గెను. దేవాలయపు తెర మధ్యకు రెండుగా చిరిగెను. ఈలాగు చిరుగుట మోషే ధర్మశాస్త్రము అంతమగుటను సూచించుచున్నది. జరిగిన సంఘటన లన్నియు గ్రహించిన శతాధిపతి నిజముగా ఇతడు దేవుని కుమారుడని ఒప్పుకొనెను (మత్తయి 27:54). రాత్రివేళ క్రీస్తు యొద్దకు వచ్చిన నికొదేము ధనవంతుడైన అరిమతయ యోసేపు యేసు దేహమును, యోసేపు సమాధియందు కొంతమంది స్త్రీల సహాయముతో పాతిపెట్టిరి. పిలాతు యేసు సమాధిని కాయుటకు

రాణువవారిని నియమించెను. కారణ మేమనగా శిష్యులు యేసు దేహమును ఎత్తుకొని పోవుదురేమోయని యూదులు చెప్పిరి. ఆదివారవము తెల్లవారు సమయమున స్త్రీలు సమాధియొద్దకు వచ్చినపుడు సమాధి తెరువబడుటయు, అది కాళీగా ఉండుటయు వారు కనుగొనిరి. యేసు పునరుద్ధానుడాయెను. ఇదియే మన తరువాత పాఠము.

**ఏకాంత జీవితము**

ఒక గ్రామమున స్త్రీకి ఒక బాలుడు జన్మించెను ఇంకొక గ్రామమున అతడు పెద్దవాడాయెను. ముప్పది సంవత్సరముల వరకు వడ్రంగము చేసెను. మూడు సంవత్సరములు ఊరూరా సంచరించుచు బోధించెను. ఆయన ఎపుడూ పుస్తకాన్ని వ్రాయలేదు. ఏ ఉద్యోగము చేయలేదు. ఇల్లు సంపాదించుకోలేదు. కుటుంబము లేదు. ఏ కాలేజీలోనూ చదువుకోలేదు. ఏ మహానగరములోను ప్రవేశించలేదు. ఆయనపుట్టిన ఊరి నుండి రెండు వందల మైళ్ళదూరం మించి వెళ్ళలేదు గొప్పతనాన్ని కల్గించే ఏ పనీ ఆయన చేయలేదు. ఆయనకు ఏవిధమైన డిగ్రీలు మొదలగునవి లేవు. యౌవనస్థుడుగా ఉన్నపుడే ఆయన ప్రజల సానుభూతి కోల్పోయెను. ఆయన స్నేహితులు ఆయనను విడిచిపోయిరి. ఆయన విరోధులకు ఆయన అప్పగింపబడెను. అపహాస్యమునకు ఆయన పాత్రుడాయెను. ఇద్దరు దొంగలమధ్య ఆయన సిలువకు మేకులతో కొట్టబడెను. ఆయన చనిపోవుచుండగా ఆయనకు కల్గిన ఏకైక అంగీకోసము సిలువ వేసిన రాణువ వ్రాళ్ళు చీటీలు వేసికొనిరి. అదియే ఆయన ఖరీదు. ఆయన చనిపోయిన తరువాత ఎరువు సమాధిలో స్నేహితుల సానుభూతితో సమాధి చేయబడెను. ఇరవై శతాబ్దాలు గడచిపోయాయి. ఇపుడాయన మానవజాతతికి అంతటికీ తలమానిక అయ్యారు. ప్రపంచములో ఉన్న అన్ని సైనికదళాలు, దేశములన్నిటినీ పరిపాలించు పార్లమెంట్‌లు, ప్రపంచములోని రాజులందరూ కలసి మానవులపై తీసుకురాలేని ప్రభావాన్ని ఈ ఒక్క వ్యక్తి తీసుకొని వచ్చారు.

గమనిక: గత 24 సంచికలలోను సంఘమును గూర్చిన వివిధ అంశములను సత్యవాక్కులో ప్రచురించాము. అవన్నీ ఒక పుస్తకము రూపమున ఇప్పుడు ముద్రించబడి లభించుచున్నవి. బైబిలు సంఘము అను పుస్తకము కొరకు సత్యవాణి ఆఫీసుకు 25 రూ॥లు ద్వారా పంపండి.

SATYAVANI, 7-9-35 RAMARAOPET, KAKINADA - 533 004

# దేవుని వాక్య ప్రయోజనము

1. ఆయన వాక్యము మనకు బోధించును.(2 తిమోతి 3:16,17)
2. ఆయన వాక్యము మనకు నేర్పును.(2 తిమోతి 3:16,17 ద్వితియో 6:1-9, కీర్తనలు 119:1-6)
3. ఆయన వాక్యము మనకు జీవమునిచ్చును.(మత్తయి 4:4)
4. ఆయన వాక్యము మనకు రూపాంతరం కలిగించును.(కీర్తనలు 119:59,60; రోమా12:2)
5. ఆయన వాక్యము మనలను పరిపక్వము చేయును (ఎఫెసీ 4:15; అపో.కా. 20:32)
6. ఆయన వాక్యము మనకు నిత్య బహుమానమునిచ్చును.(అపో.కా. 20:32; 1పేతురు 1:3-12)
7. ఆయన వాక్యము మనలను నడిపించును.(కీర్తనలు 119:105)
8. ఆయన వాక్యము మనలను దిద్దును(2 తిమోతి 3:16,17;హెబ్రీ 4:12,13)
9. ఆయన వాక్యము మనలను పవిత్ర పరచును.(1 పేతురు 1:22)
10. ఆయన వాక్యము మనలను విడిపించును.(యోహాను 8:31,32
11. ఆయన వాక్యము మనలను రక్షించును (రోమా 1:16)
12. ఆయన వాక్యము మనలను దేవుని పోలికగా రూపొందించును(1 పేతురు1:23,24)
13. ఆయన వాక్యము మనలను పరిశుద్ధ పరచును.(యోహాను 17:17)
14. ఆయన వాక్యము మనలను ఆదరించును.(కీర్తన 119:50,76; 1 థెస్స4:16,18)
15. ఆయన వాక్యము మనలను కాపాడును.(ఎఫెసీ 6:17)
16. ఆయన వాక్యము మనలను తప్పినపుడు గద్దించును(2 తిమోతి 3:16,17;4:23)
17. ఆయన వాక్యము మనలను దేవుని యెదుట సిగ్గు పడకుండా చేయును.(2 తిమోతి 2:15)
18. ఆయన వాక్యము మన వృద్ధికి నమ్మకం కలిగించును.(1 పేతురు 2:2; 2పేతురు 3:18 )

– ఎస్.ఆర్. తిరుగుళ్ల

# మొదటి మానవుడైన ఆదాము

## Adam, the First man

" దేవుడు తన స్వరూప మందు నరుని సృజించెను; దేవుని స్వరూపమందు వాని సృజించెను" (ఆది.కా. 1:27).

"దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవ వాయువును ఊదగా నరుడు జీవాత్మ అయెను" (ఆది.కా. 2:7).

పెరిగి పెద్ద వానివలె పుడితే ఏలాగుంటాది? ఈ భూమి అంతటిలోను ఏకైక మానవునిగా దేవునితో సంబంధము కలిగి ఆదాము ఎట్లు భావించెను? సృష్టి యొక్క అందాన్ని గూర్చి, గంభీరతను గూర్చి ఆశ్చర్యపడ్డాడా? దాన్నంతా దేవుడ తనికిచ్చి నప్పుడు తబ్బిబ్బులయ్యాడా? మొదటి మానవుని పరిస్థితిని మనం ఊహించుకో వచ్చును.

ఆదికాండము 2:19లో ఆ నరుడు ఆదాము అనిపిలువ బడెను. ఆదాము అనగా హెబ్రీభాషలో మట్టి-మన్ను అని అర్ధము. మానవ జాతితో సమానమైనది ఆదాము అనుపదము. కొన్ని భాషలలో మానవజాతిలో పురుషుని సూచించుటకు అది వాడబడెను. ఆదికాండము 5:1-5 వంశావళిలో మొదటి పురుషుడు ఆదాము అని పిలువబడెను.

దేవుడు సృష్టి అంతా చేసి, ఆదామును ఏదెనువనంలో యుంచి, అతడు పేర్లు పెట్టునట్లు జంతువులన్నిటిని అతని యొద్దకు తీసికొని రావడం. ఆ దృశ్యం ఒకసారి ఆలోచించు. అది దేవునికి మానవునికి సంతోష సమయమే. ఆదాము జంతువులకు ఏ పేర్లు పెట్టెనో అవే నేటికిని వాడుకలో యున్నాయి.

గాని ఆదాముకు సాటియైన సహాయముగా జంతువులేమీ సరిపోలేదు. ఏఒక్క జంతువు మానవునికి సాటిరాలేదు. (ఆది.కా. 2:20). మనం కోతిలో నుంచి వచ్చామని కొందరు తప్పుగా అనుకొనుచున్న కోతి కూడా అక్కడే యుండెను ! దేవుడు ఆదాముకు గాఢ నిద్ర కలుగజేసి అతని ప్రక్కటెముకలలో ఒక దానిని స్త్రీనిగా చేసి ఆదాముకు సాటియైన సహాయముగా యిచ్చెను. ఈ ఆశ్చర్య సృష్టిని చూడగానే ఆదాము యొక్కమాటలలోని అందాన్ని గమనించు "నా యెముకలలో ఒక యెముక, నా మాంసములో మాంసము; ఇది నరునిలో నుండి తీయబడినది. గనుక నారి అనబడును" (ఆది.కా. 2:23).

తరువాత రెండు వచనాల్లోను యున్న మాటలు చదువరులకు ఆసక్తి కరంగాయున్నాయి. ఒక పురుషుడు, ఒక స్త్రీ ఒండొరులను ప్రేమిస్తు, అందమైన వనంలో కాలం గడపడం నేడు అనేకుల కలలను స్ఫురించుచున్న దృశ్యము!

చిన్న పిల్లలు తల్లిదండ్రులపై సంపూర్ణముగ ఆధారపడి యుండునట్లు ఆదాము, తన భార్య సమస్తానికి దేవునిపై ఆధారపడి యుండిరి. శోధింపబడి పాపము చేసిన తరువాత వారు దేవునికి అవధేయులయ్యారని వారు గుర్తెరిగిరి.

వారి శిక్ష, ఏదెను వనం నుండి తోలివేయబడడం అంతా ఆదాము హవ్వలకు భయంకరంగా ఉండి యుండేది. దేవుడు వారికి చర్మము చొక్కాయిలు చేయించినా, వారు తమంతటతామే బ్రతుక వలసి వచ్చింది. ఇట్టిసమయంలో ఆదాము తన భార్యకు హవ్వయని పేరు పెట్టాడు; ఏలయనగా ఆమె మానవాళి కందరకూ తల్లి. వారెన్నడు ఎరుగని అనుభూతి, ఇద్దరు చిన్న బిడ్డలకు తల్లిదండ్రులై యుండుట గదా !

బైబిలులో చెప్పబడకపోయినా, దేవుడు వారితో సన్నిహిత సంబంధముకలిగే యున్నారు. కయీను తన తమ్ముడైన హేబెలును చంపినప్పుడీ సంగతి మనకు తెలుస్తాది. వారిద్దరు దేవునికి బలులు అర్పించుచుండిరిజ తన తమ్ముని గూర్చి దేవుడు కయీనును ప్రశ్నించగా అతడు ఆశ్చర్యపోలేదు. సరిగదా అతడు ఎదురు ప్రశ్నలడిగాడు. "నా దోష శిక్ష నేను భరింపలేనంత గొప్పది'' యని ఆది.కా. 4:13లో అతడన్నాడు. దేవుని సంరక్షణ లేకుండా బ్రతుకు భయకంపితమైనదనే తలంపులను అతడు వ్యక్తపర్చాడు. మానవుల యెడల దేవుడు తన కృపను క్షమాపణను వ్యక్త పర్చుచునే యున్నారు. ఆదాము హవ్వలు మొదటిగా ఆజ్ఞను అతి క్రమించక ముందే మానవుని విమోచన కొరకు ఒక పథకమును సిద్ధపరచి యుంచెను. పాపపరిహారార్ధ బలిగా తన కుమారుని అర్పించుటకు నిశ్చయించెను. ఆదికాండము 5:3లో దేవుడు ఆదాము హవ్వలకు షేతు అను కుమారుని, తదుపరికుమారులను కుమార్తెలను అనుగ్రహించినట్లు చూడగలము. ఆ పిల్లలు "తన పోలికెగా తన స్వరూపమందున్నట్లు" అతడు కను గొనెను.

మొదటి పురుషుడైన ఆదాము మట్టి నుండి చేయబడినవాడు. 930 ఏండ్లు బ్రతికెను. మృతిబొందెను.

1 కొరింధీ 15:22,23 లో అపొ.పౌలు ఆదామును క్రీస్తుతో పోల్చుట మనం చూస్తాము. ఆదాముతో మరణం ఆరంభమాయెను. క్రీస్తుతో జీవము కలిగెను. ఆదాము పాపము వలన మనందరం మరణిస్తాము. క్రీస్తు యొక్క సిలువ మరణము వలన ఆయన యందు విశ్వాసముంచువారు నిత్యము బ్రతుకుదురు.

- ఫ్రాన్సెస్ పార్.

## సంక్షిప్త వార్తలు

2008 ఆగష్టు 23వ తేదీ శనివారం నర్సీపట్నం మండలం కొదవడిపూడిలో జరిగిన సువార్త కూటములో రిక్కీగూటం గారు, ఏరన్ ఫాక్స్‌గారు వాక్య పరిచర్యచేసిరి. అక్కడనున్న స్థానిక సంఘం గతంలో కేథలిక్కులకు చెందిన వారు. ఆకూటములో ముగ్గురు క్రీస్తులోనికి బాప్తీస్మము పొందిరి. ఆ సాయంత్రం దూసరపాము గ్రామములో సువార్త కూటము జరిగెను. అక్కడ సి. హెచ్. జోసఫ్ గారు సువార్త పరిచర్య జరిగించు చున్నారు.

2008 సెప్టెంబర్ 8 నుండి 13 వరకు రిక్కీగారు, ఏరన్ గారు బకలూరు, నర్సీపట్నం కొదవడిపూడి, ఏ.బి. కోలనీ ప్రాంతములలో పరిచర్య చేసిరి. ఐదుగురు క్రీస్తులోనికి బాప్తీస్మము పొందిరి. పై గ్రామములలో సోదరుడు సి. హెచ్. జోసఫ్, బి. పాల్, నాని గార్లు తదితరులు వాక్య పరిచర్య చేయుచున్నారు.

సెప్టెంబర్ 17వ తేదీ బుధవారం ఉప్పలగుప్తం మండలం పేరాయి చెరువు గ్రామములో సువార్తికుల సదస్సు జరిగెను. 2001 సంవత్సరములో సోదరులు జాషువాగూటం గారు ఆ గ్రామములో ఒక మంచి ఆలయము నిర్మించారు. మంచి వాతావరణములో ఆ ఆలయములో సదస్సు జరిగెను. అక్కడ పెయ్యల సత్యన్నారాయణ గారు క్రీస్తు సంఘ సువార్తికునిగా పలు సంవత్సరముల నుండి పనిచేయుచున్నారు. సదస్సుకు అనేక ప్రాంతముల నుండి 200కు పైగా సువార్తికులు హాజరయ్యారు. రక్షణ పొందుటకు మానవుడేమి చేయవలెను? అను అంశము ఆ రోజు ఉపదేశింపబడెను.

ఉదయకాల కూటములో సోదరులు యి. ప్రభాకర రావు (రిటైర్డు ప్రిన్సిపాల్, కాకినాడ), రాజా విజయకుమార్ (రాజమండ్రి) యస్. యేసురత్నం (కాకినాడ), జి. షద్రక్ (పాలకొల్లు) గార్లు పై అంశము పై చక్కగా ఉపదేశించిరి.

మధ్యాహ్న కాలమందు సోదరులు ఏరన్ ఫాక్స్‌గారు చక్కగా ఉపదేశించిరి. రిక్కీ గూటం గారు అధ్యక్షత వహించి సదస్సును సమర్ధవంతంగా నడిపించిరి.

మానవుడు జన్మతా పాపికాడు గాని, భాద్యతాయుక్త వయస్సు వచ్చుసరికి స్వయంకృతాపరాధము వలన పాపియగుచున్నాడు. తత్ఫలితముగా దేవుని నుండి దూరమగుచున్నాడు. అతడు దేవునితో సత్సంబంధము కలిగియుండాలంటే పాపములనుండి విముక్తి పొందాలి, రక్షింపబడాలి. మానవుడు తన్నుతాను రక్షించుకొనలేడు గనుక అతని రక్షించడానికి ఈ లోకమునకు వచ్చిన యేసు క్రీస్తు నందు విశ్వాసముంచి పాపముల విషయమై మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తం క్రీస్తులోనికి బాప్తీస్మము పొందాలి. నమ్మి బాప్తీస్మము పొందినవాడు రక్షింపబడునని యేసు చెప్పిన మాటలకు లోబడువాడు రక్షింపబడునని సోదరులు చక్కగా ఉపదేశించిరి. సదస్సుకు హాజరైన వారందరికీ పెయ్యల సత్యన్నారాయణ గారు స్థానిక సంఘము మంచి భోజనము ఏర్పాటు చేసిరి. అందరు దేవునికి కృతజ్ఞతలు చెల్లించిరి.

అక్టోబరు 16వ తేదీ గురువారం జాషువా గూటం గారి ద్వితీయ కుమారుడు శామ్యూల్ రోనీ గారి వివాహము కాకినాడలో జరుగును. ప్రార్థించమనవి.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:

**SATYA VAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**